నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com

మూడు రోజులపాటు మద్యం దుకాణాల బంద్

- నేటి సాయంత్రం 4 గంటల నుండి 27 సాయంత్రం 4 గంటల వరకు

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేడు (మంగళవారం) సాయంత్రం 4 గంటల నుండి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలను బంధు వుంచాలని నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ దిలీప్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 25న సాయంత్రం నాలుగు గంటల నుండి 27 సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల దృష్టిలో ఉంచుకొని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు డ్రైడే ఆర్డర్స్ జారీ చేసినట్లు తెలిపారు. లైసెన్స్ దారులందరూ గమనించాలన్నారు. ఇది అన్ని ఏ4 షాప్స్ (మద్యం దుకాణాలు), 2బీ (బార్స్)లు, కల్లుడిపోలు(కల్లు దుకాణములు) , కళ్ళు డిపో(కల్లు డిపోలు), ఐ ఎం ఎఫ్ ఎల్ డిపో మాదాపూర్, టి డి1 బార్(హరిత ఇందుర్), సిఎస్2 క్యాంటీన్ ల కు వర్తిస్తుంది అని తెలియజేశారు.

గ్యాంగ్‌రేప్ నిందితుల కారు గుర్తింపు

- నిందితులు ఉపయోగించిన కారు సీపీ ఆఫీస్‌లోని మహిళా ఉద్యోగినిదిగా గుర్తింపు

నవతెలంగాణ-ధర్పల్లి



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

మండలంలోని డిబి తండా సమీపంలో శనివారం ఇద్దరు మహిళలపై జరిగిన గ్యాంగ్ రేప్‌లో నిందితులు ఉపయోగించిన కారును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ కారు పోలీస్ కమిషనరేట్‌లోని ఓ మహిళా ఉద్యోగినిదిగా తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రామకృష్ణకు వివరణ కోరగా నిందితులైన నలుగురిపై కిడ్నప్, రేప్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మంగళవారం రిమాండుకు పంపనున్నట్లు అయన తెలిపారు.

మీ ఉద్దెర పెత్తనం ఏంటీ..?

- ఉన్న ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కలలు
- రాష్ట్రానికి నిధులు రాకుండా అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి
- భావోద్వేగాలు రెచ్చగొట్టి వీధినాటకాలు ఆడటమే బీజేపీ పని
- ఫోన్‌ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను కాపాడుతున్న బీజేపీ
- లోపాయికార ఒప్పందంతోనే పోటీకి బీఆర్ఎస్ దూరం
- ఎవరికి ఓటు వేయాలో కేసీఆర్ చెప్పాలి
- చెప్పిన పనులు చేశాం.. చేస్తున్నాం
- కాంగ్రెస్ పార్టీని ఆదరించి నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించి మద్దతు ఇవ్వండి
- పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి



పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. హాజరైన పీసీసీ చీఫ్, ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ చైర్మన్‌లు, ముఖ్య నాయకులు.. నమస్కరిస్తున్న నరేందర్‌రెడ్డి



ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్/కంఠేశ్వర్

'ఉపఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం అని కేటీఆర్, హరీశ్‌రావు అంటున్నారు. అసలు ఇప్పుడున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీలో లేరో చెప్పాలి. ఉన్న ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కలలు కంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభుత్వం కూలింది. పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరపున నిలబెట్టేందుకు అభ్యర్థులే కరువైయ్యారు. అసలు మీ ఉద్దేర పంచాయితీ ఏంటీ..?' ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలని చెప్తారని' సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భూమరెడ్డి కన్వెన్షన్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅథితిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో పట్టభద్రులు, నిరుద్యోగులు, విద్యార్థులు ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. కానీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదేండ్ల కాలంలో వారికి చేసిందేమీ లేదు. పదేండ్ల కాలంలో వారు 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలే. నిరుద్యోగులంతా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో కోచింగ్ సెంటర్ల చుట్టూ పదేండ్ల పాటు అనాథల లెక్క తిరిగారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేయలే. ఒక వేళ వేసినా.. కోర్టులో వారే కేసులు పెట్టుకుంటూ ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటుండే. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలోనే 56 వేల ఉద్యోగాలు కల్పించాం. 11 వేల టీచర్ పోస్టులు, 15 వేల పోలీస్ కొలువులు, 6 వేల వైద్య సిబ్బంది నియామకం చేపట్టాం. దీంతో పాటు అనేక డిపార్ట్‌మెంట్‌లలో ఉద్యోగాల భర్తీ చేపట్టాం. ఉద్యోగాలు భర్తీ చేసినట్టయితేనే కాంగ్రెస్‌కు ఓటేయ్యండి. లేకుంటే మిగతా వారికి ఓటు వేయండి' అని సూచించారు.

'టీచర్‌ల ప్రమోషన్‌లు, బదిలీలు చేపట్టాం. చదువులు పూర్తయినా.. అందుకు తగ్గ సామర్థ్యం లేకుండా పోతోందని టాటా సంస్థతో 2400 కోట్ల రూపాయలతో ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం పెంచితేనే ప్రయివేటు రంగాల్లో ఉద్యోగఅవకాశాలు మెరుగుపడుతాయి. పబ్లిక్, ప్రయివేటు పార్టనర్‌షిప్(పీపీపీ)లో మహింద్రగ్రూప్ ఆనంద్ మహింద్రాను చైర్మన్‌గా.. పెద్దపెద్ద కంపెనీల యజమానులను డైరెక్టర్‌లుగా నియమించి స్కిల్ డెవలప్‌మెంట్ కోసం కృషి చేస్తున్నాం. క్రీడా రంగంలో అభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. క్రీడాకారులైన నిఖత్ జరీన్‌ను, సిరాజ్‌ను, నగదు ప్రోత్సాహకం అందించి డీఎస్పీగా, గ్రూప్ 1 ఆఫీసర్‌లగా నియమించామని' గుర్తుచేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల నిధులతో రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని, దీంతో పాటు రైతు భరోసా నిధులు సైతం రైతు ఖాతాల్లో వేశామని తెలిపారు. ఖాతాలో నగదు జమ అయితే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. సన్న వడ్లకు బోనస్ చెల్లించామని ఇలా ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

కానీ గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తమ నడుములు వంగిపోతున్నాయని అన్నారు. ఆ అప్పులు తీర్చేందుకు, వడ్డీలు చెల్లించేందుకు అదనంగా అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఈ ఏడాది 75 వేల కోట్లు చెల్లించినట్టు తెలిపారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. ఇన్ని సమస్యలలున్నా.. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం ఎప్పుడు వచ్చేదో తెలిసేది కాదని, దీంతో ఈఎంఐలు కట్టలేక, ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు సకాలంలో చెల్లించలేక సతమతమయ్యేవారని తెలపారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ రూ.8 వేల బకాయిలు పెట్టి కేసీఆర్ జారుకున్నారని.. వాటిని క్లియర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టి వందేళ్ల సమస్యను తీర్చామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. లెక్కలు మీ ముందుకు పెడితే చేసిన లెక్కలు తప్పని వండిన అన్నంలో ఉప్పు వేసే ప్రయత్నం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ లెక్కలు తప్పైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపట్టి ఈ లెక్కలు తప్పని నిరూపించాలని సవాల్ విసిరారు. కేసీఆర్ 12 గంటల్లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే సొక్కమైన లెక్కలో బీసీలు 51 శాతం ఉన్నారని తేల్చారని, కానీ తాము చేసిన సర్వేలో 56 శాతం అని తేల్చామని గుర్తు చేశారు.

మోడీ మందకృష్ణ మాదిగను కౌగిలించుకుండు ముద్దు పెట్టుకుండు కానీ ఎస్సీ వర్గీకరణ చేయలేదని అన్నారు. 12 ఏండ్లుగా అధికారంలో ఉన్నా.. ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కొందరికి నష్టమైనా, కష్టమైనా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేశామని అన్నారు. కానీ బీజేపీ సమస్యను జఠిలం చేస్తుందే కానీ పరిష్కరించదని అన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఢిల్లీలో పరిచాయాలు ఉన్నాయని, కానీ నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. నిధులు వస్తే ఎక్కడ రేవంత్‌రెడ్డికి పేరు వస్తుందోనని అడ్డుకుంటున్నారని అన్నారు. మెట్రోకు అనుమతి రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని అన్నారు. యూపీలో గంగా, ఢిల్లీలో సబర్మతి నదిని ప్రక్షాళన చేస్తున్నారని మరి హైదరాబాద్‌లోని మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు.

పదేండ్లలో రాని ఉప ఎన్నిక ఇప్పుడెందుకు వస్తది..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో రాని ఉప ఎన్నిక ఇప్పుడు ఎందుకు వస్తదని సీఎం ప్రశ్నించారు. గతంలో ఉన్న కోర్టులే ఇప్పుడూ ఉన్నాయని, గతంలో ఉన్నట్టే స్పీకర్ ఇప్పుడు సైతం ఉన్నట్టు తెలిపారు. అటు మోడీతో ఇటు కేసీఆర్‌తో కొట్లాడుతున్నానని, తమకు మనోధైర్యం పెరగాలి అంటే అండగా నిలబడాలని కోరారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించినట్టు చెప్పట్లేదని, కానీ పరిష్కరించే అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిపారు.

ప్రభాకర్‌రావును పట్టుకొస్తే 48 గంటల్లో అరెస్టు

ఫోన్ ట్యాపింగ్ కేసులో అమెరికా పారిపోయిన ప్రభాకర్‌రావును పట్టుకొస్తే 48 గంటల్లో కేసీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. కానీ కేంద్ర సహాయ మంత్రి బండిసంజయ్ అడ్డుకుంటున్నాడని విమర్శించారు. హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండిసంజయ్.. ప్రభాకర్‌రావును తన శాఖతో ఇండియాకు రప్పించే అవకాశం ఉన్నా.. బీఆర్ఎస్‌తో ఉన్న లోపాయికార ఒప్పందంతో తీసుకురావడం లేదని అన్నారు. గొర్రెల స్కాం, ఈకార్ రేసులో ఈడీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదని, పెద్దమొత్తంలో విదేశాలకు నగదు పంపిన కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. అమెరికా నుంచి పలువురిని బేడీలు వేసి మరీ పంపిస్తున్నారని, మరి ప్రభాకర్‌రావును ఎప్పుడు తీసుకొస్తావని బండిసంజయ్‌ను ప్రశ్నించారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని బరిలో దించలేదని అన్నారు.

భావోద్వేగాలు రెచ్చగొట్టడమే బీజేపీ పని

చేసిన పని చెప్పకుండా ప్రజల భావోద్వేగాలు రెచ్చగొట్టి వీధి నాటకాలు ఆడటమే బీజేపీ నాయకుల పని అని సీఎం విమర్శించారు. గుజరాత్ రాష్ట్రంలో 29 శాతం ముస్లింలకు రిజర్వేషన్‌లు అమలు అవుతున్నాయని, అదే విధంగా మధ్రప్రదేశ్, హర్యాన, బీహార్‌లో సైతం ముస్లింలకు రిజర్వేషన్‌లు అమలవుతున్నట్టు గుర్తుచేశారు. బీసీల ఆత్మగౌరవం నిలబెట్టామంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.







8 మంది బీజేపీ ఎంపీలున్నా..
బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు సున్నా

బీజేపీ నాయకులను ప్రశ్నించాలని పట్టభద్రులకు పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

విజన్ ఉన్న రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత ఫామ్ హౌస్ లో పడుకునే నాయకులకు లేదన్నారు. ఉద్యోగాలు, నీళ్ల కోసమే తెలంగాణ సాధించుకున్న తెలంగాణలో 10 ఏళ్లలో బీఆర్ఎస్ 10 ఏళ్ల కాలంలో 50వేలకు మించి ఉద్యోగాలు భర్తీ చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో 56వేల ఉద్యోగాలను రేవంత్ భర్తీ చేశారన్నారు. ప్రతి ఖాళీని భర్తీ చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2 కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఉన్న ఉద్యోగులను పీకేసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసిందని విమర్శించారు. రాష్ట్రానికి బీజేపీ ఎంపీలు బడ్జెట్ లో తీసుకువచ్చింది సున్నా అని, దీనిపై పట్టభద్రులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని అన్నారు. తాము జిల్లాకు 5 కళాశాలలు తెచ్చామని, తెయూ ఇచ్చిందే కాంగ్రెస్ అని అన్నారు. నరేంద్ రెడ్డిని నిజామాబాద్ జిల్లా పట్టబద్రులు ఆశీర్వదించాలని కోరారు.

ఆదరించండి.. వారధిగా ఉంటా

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి

తనను గెలిపిస్తే పట్టభద్రులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, సుమారు పదేళ్ల తరువాత తాము బదిలీలు, ప్రమోషన్లకు నోచుకున్నామని టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పది రోజుల క్రితమే 2008 డీఎస్సీ నియామకాలు, జాబ్ క్యాలెండర్ పై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్, లా కళాశాలలను మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నానని అన్నారు. అలాగే ఉర్దూ కళాశాల భవన నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో కళాశాలను అందులోకి షిఫ్ట్ చేయాలని కోరారు. తనను గెలిపించాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నరేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

అబద్ధాల బీజేపీని ఓడించండి

పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీపీఐ(ఎం) మద్దతు

అనుభవజ్ఞుడు, విద్యావేత్త ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి

సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కమిటీ పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

'ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలలో నలుగురు బిజెపి ఎంపీలు ఉండి కేంద్ర బడ్జెట్లో నిధులు తీసుకురావడంలో వైఫల్యం చెందారని, తెలంగాణ విభజన హామీలను ఏ ఒక్కటి బిజెపి నెరవేర్చలేదు. అబద్ధాల బిజెపిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించాలని జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అనుభవిజ్ఞుడు విత్త విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తరపున కోరుతున్నట్టు తెలిపారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ జిల్లాకు బండి సంజయ్ కేంద్ర సహాయ మంత్రిగా ఉండి కూడా సైనిక్ పాఠశాల గాని, కొత్తగా నవోదయ పాఠశాలలు గాని తీసుకు రాలేదని, నిజామాబాదుకు పసుపు బోర్డు ప్రకటించినప్పటికీ కేంద్ర బడ్జెట్లో ఒక్కరూపాయి నిధులు కూడా కేటాయించలేదన్నారు. కాజీపేట రైల్వే కోచ్, గిరిజన యూనివర్సిటీ విభజన హామీలలో ఉన్నప్పటికీ ఏ ఒక్క అభివృద్ధి పని సాధించకుండా, బిజెపి కేవలం కులాల, మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపు కోవాలని చూస్తుందని విమర్శించారు.

బీజేపీ కేంద్రంలో అధికారన్ని అడ్డు పెట్టుకొని రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. వ్యాపారవేత్త, అనుభవ రహితుడు అంజిరెడ్డికి టిక్కెట్ ఇచ్చి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింప చేసుకోవాలని చూస్తున్నారని, ప్రజలు గమనించి బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. సీపీఐ(ఎం) రాజకీయ విధానం మేరకు బిజెపిని ఓడించగలిగే శక్తి, విద్య, సామాజిక సేవ అనుభవం ఉన్న వ్యక్తి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డినే అని 13 జిల్లాల కార్యదర్శిల అభిప్రాయం, సూచన మేరకు కాంగ్రెస్ అభ్యర్థి అయిన వూట్కూరి నరేందర్ రెడ్డి కి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. నరేందర్ రెడ్డి గెలుపునకు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని, మేధావులను, గ్రాడ్యుయేట్లను, కలిసి విస్తృత ప్రచారం చేసి నరేందర్ రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, కొత్త నరసింహులు, ముదాం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, పోడు భూములకు
హక్కుపత్రాలు ఇవ్వాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్రావ్ డిమాండ్
- అడిషనల్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కామారెడ్డి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ఇండ్ల స్థలాలు పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం తెలంగాణ కార్మిక సంఘం ఆధర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న పేద ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, పోడు భూములు సాగు చేసుకుంటున్నా పోడు రైతులకు అక్కుపత్రాలు కల్పించాలన్నారు. తాము ఇచ్చిన వినతి పత్రానికి సనుకులంగా స్పందించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో మూడు సంవత్సరాలుగా నివాసం ఉంటున్న జంగంపల్లి గ్రామస్తులకు వెంటనే కరెంటు మీటర్లు మంజూరు చేసి మిషన్ భగీరథ నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రైతులు సాగు చేసుకుంటున్న పోడు రైతులందరికీ వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం స్పందించాలన్నారు. భూపోరాటంలో పాల్గొన్న కొంతమందికి కులాల పేరుతో జరిమానాలు విధిస్తున్న వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటి అమలు చేయాలన్నారు. జంగంపల్లి గ్రామం మల్లేశ్వర జయం కాలనీకి స్వయాన ముఖ్యమంత్రి తమ్ముడు ఎన్నికల సమయంలో జగన్‌రెడ్డి వచ్చి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారులు స్పందించకపోతే ఎక్కడికక్కడ కార్యాలయాలను దిగ్బంధిస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పద్మ, జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, జిల్లా అధ్యక్షులు వెంకట్, భాస్కర్, లిబియా, బాబ్జాన్, నరసవ్వ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలి

ప్రయవేటు సంస్థలకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచన

నవతెలంగాణ-కామారెడ్డి



కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

ఈ నెల 27న నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ పూర్వ జిల్లాలతో కూడిన కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ జరగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలలో పని చేస్తున్న వారికి సంబంధిత యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న (గురువారం) ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, ఇతర అన్ని సంస్థల యాజమాన్యాలు, నిర్వాహకులు తమ సంస్థలలో పని చేసే పట్టభద్రుల నియోజకవర్గాలలో ఓటర్లుగా నమోదైన ఉద్యోగులు, కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునేలా సౌకర్యాలను కల్పించాలని అన్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు కలిగి ఉన్న వారు నిర్ణీత సమయంలోపు ఓటు వేసేందుకు వీలుగా వారికి విధులకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతించడం, షిఫ్ట్‌ల సర్దుబాటు, తక్కువ పని గంటలు కేటాయించడం వంటి వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ ఆయా యాజమాన్యాలకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తూ పట్ట భద్రులు, ఉపాధ్యాయుల కరీంనగర్ నియోజక వర్గానికి చెందిన ఉద్యోగులు ఓటుహక్కు కలిగియున్న వారు వారి ఓటును వినియోగించుకొనుటకు ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించడం జరిగిందని, ఆయా కార్యాలయాల అధికారులు అట్టి సెలవును మంజూరు చేయవలసిందనీ తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేస్తాం

- నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ యువజన విభాగం ఉపాధ్యక్షుడు వినోద్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపుననకు కృషి చేస్తామని నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్ అన్నారు. సోమవారం నిజామాబాద్ లింబారెడ్డి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సభలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డిని నిజామాబాద్ యువజన విభాగం ఉపాధ్యక్షుడు వినోద్ కలిసి భారీ మెజారిటీతో గెలిపిస్తామని అన్నారు. ఆయనను కలిసిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

ఆలయ ఉత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-ముప్కాల్

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన సోమవారం ముప్కాల్, కొత్తపల్లి గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు శివపార్వతుల ఊరేగింపు కార్యక్రమంను భక్తుల నడుమ చేపట్టారు. వాడ వాడల్లో శివపార్వతుల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 26న స్వామి వారి కళ్యాణం, 27 గురువారం అన్నదాన సత్రం ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, స్వామి ములధారణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుకనవుతా

- ధర్మ సమాజ్ పార్టీ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి
- నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్, సెంట్రల్ లైబ్రరీలో ప్రచారం


మాట్లాడుతున్న మంద జ్యోతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పట్ట భద్రులు తమ ప్రథమ ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ధర్మ సమాజ్ పార్టీ ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజమాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేల కోట్లున్న అగ్రవర్ణాలు పోటీ చేస్తున్నాయని, కాంగ్రెస్ బిజెపి లాంటి పార్టీలు వేల కోట్లు ఉన్న నాయకులకు ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. వారి వల్ల సమాజానికి మేలు జరగదని, . ప్రజాస్వామికంగా పీడిత బాధిత వర్గాలకు న్యాయం జరగాలంటే అనగారిన వర్గాల ప్రాతినిథ్యం కావాలని పేర్కొన్నారు. వైద్య వృత్తిలో ఎంతో సేవలందించిన, పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్న తనకు మద్దతుగా నిలిచి గెలిపించాలని వేడుకున్నారు. విద్య వైద్యం నాణ్యతలేమితో ప్రజలు మరింత పేదరికం బారిన పడుతున్నారని, అగ్రకులాలకు ఓటుకు అమ్ముడు పోకుండా ఓటు చైతన్యంతో పట్టభద్రులు, విద్యావంతులు, మేధావులు ఆలోచించి ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీరియల్ నెంబర్ 9 న మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్‌ని , బార్ అసోసియేషన్ సభ్యులను కలిసి ఓటును అభ్యర్థించారు. అనంతరం జిల్లా కేంద్ర లైబ్రరీలో విద్యావంతులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంబేద్కర్ సంఘాల జేఏసీ నాయకులు పుష్పగుచ్చంతో ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సుమన్, ప్రేమ్, జిల్లా అధ్యక్షులు మహిపాల్ మహారాజ్, మురళి, మండలాల అధ్యక్షులు ఉమేష్, నిశాంత్, గంగాధర్, మహేష్, కిషన్, ముఖ్య నాయకులు అన్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయండి

- అధికారులకు సమితి సభ్యుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామపరిరక్షణ సమితి సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ 'గ్రామపరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో (సూచిక బోర్డులు) వీధి నంబర్లను కేటాయించి, వార్డుల వారిగా ఏర్పాట్లు చేయాలని కోరుతూ మండల అభివృద్ధి అధికారి నరేష్ ఆనంద్‌కు వినతిపత్రంను సమర్పించామని సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ సిబ్బందికి వినతిపత్రంను అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్రామపరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గైని సంజీవ్ థామస్, గౌరవ అధ్యక్షులు నాయకుడు సంతోష్ కుమార్, కట్ట మహేష్, నేర బాబురావ్, చిన్న బాల్ రాజ్, కంచు విజయ్, ఓజా ప్రకాష్, కందుల శంకర్, పంచాయితీ రాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ప్లాట్ల వెంచర్ ప్రారంభించిన పసుపు బోర్డు చైర్మన్


వెంచర్‌ను ప్రారంభిస్తున్న పసుపు బోర్డు చైర్మన్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో కోటార్మూర్ శివారులో అరవిందనగర్ కాలనీలో కోటపాటి డ్రీమ్ సిటీ వెంచర్‌ను సోమవారం జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, సీనియర్ బిజెపి నాయకుడు లోక భూపతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.. ఈ వెంచర్ ను అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో డి టి సిపి రెరా, మిషన్ భగీరథ అనుమతులు సాధించి వెంచర్ ఏర్పాటుచేసినట్టు కోటపాటి నరసింహనాయుడు వివరించారు. సరసమైన ధరలో అన్ని రకాల సౌకర్యాలతో ప్రభుత్వ అనుమతులతో ప్లాట్లు ఉన్నాయని పల్లె గంగారెడ్డి తెలిపారు. భూపతిరెడ్డి మాట్లాడుతూ.. చట్టబద్ధమైంది కాట్టి ఇంటి స్థలం లేని ప్రజలు కొనుగోలు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో అప్పల ఆనంద్ రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, న్యాయవాదులు బాలయ్య, జి జి .రాం, జక్కుల శ్రీధర్, బిజెపి పట్టణ అధ్యక్షులు మందుల బాల కృష్ణ, నక్కల చిన్నరెడ్డి, . రుక్మాజి, కొక్కుల విద్యాసాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- అదనపు కలెక్టర్ అంకిత్
- బాల్కొండలో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-బాల్కొండ

జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ సోమవారం జలాల్ పూర్, బాల్కొండ గ్రామాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముందుగా జలాల్ పూర్ శివారులోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ను జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ సందర్శించారు. గ్రిడ్ యొక్క వాటర్ కెపాసిటీ, ప్రస్తుత నీటిమట్టం, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరాకు సంబంధించిన వివరాలను, గ్రిడ్ యొక్క సమస్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్


వాటర్ గ్రిడ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

మండల కేంద్రంలోని కస్తూరి గాంధీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పాఠశాలలోని కిచెన్, డైనింగ్ హాల్ లను పరిశీలించి సదుపాయాలను గమనించారు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, సరుకుల స్టాక్ ను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తాజా కూరగాయలు వినియోగించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి,మిషన్ భగీరథ డిఈఈ మొహమ్మద్ అమీర్ ఖాన్, ఏఈఈ సమీర్, కేజీబీవీ ప్రత్యేక అధికారిని భవాని తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- జర్నలిస్టులపై దాడులు అరికట్టేలా ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి
- టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రంలో జర్నలిస్ట్ లు పరిస్థితి దారుణంగా మారాయని అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులు ఈడుస్తున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆవేదన వ్యక్తం చేసింది. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం టి డబ్ల్యు జె ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ చాంబర్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వమే రివ్యూ పిటిషన్ వేసి వాదనచేసి జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు కొత్త ఆరోగ్య


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

భీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలు చేయాలని, జర్నలిస్టుల కంట్రిబ్యూషన్ ప్రభుత్వం భరించాలని కోరారు. కొత్త అక్రిడేషన్ కార్డులు అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, రెండుసార్లు వాయిదా వేసింది అని అన్నారు. వెంటనే జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరి జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని ఇందుకోసం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని కోరారు. అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానెల్మెంట్లో చేర్చాలని కోరారు. వార్తల సేకరణకు కలెక్టరేట్‌కు వచ్చే జర్నలిస్టుల కోసం కలెక్టరేట్లో ఒక ప్రత్యేక గది కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అడవల అనిత, నాయకులు మీస మధు, కోరి రాకేష్, రాజేందర్, దూడ క్రిష్ణకుమార్, అమంద్ ప్రవీణ్ పాల్గొన్నారు.

యువతులపై లైంగిక దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలి

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్

నవతెలంగాణ -ధర్పల్లి



మండలంలోని దుబ్బాక అటవీ ప్రాంతంలో ఇద్దరు యువతులపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భీంగల్ ఏరియా కార్యదర్శి వి బాలయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. దాడి నుంచి ఒక మహిళ తప్పించుకొని రోడ్డుపైకి వచ్చి అక్కడ ఉన్న రైతుకు చెప్పడంతో ఆయన గ్రామంలో సమాచారం ఇచ్చారన్నారు. గ్రామ ప్రజలు సంఘటన స్థలానికి వెళ్లి సరికి దాడికి పాల్పడిన వారు తప్పించుకున్నారని తెలిపారు. కారు డ్రైవర్ను పట్టుకొని ధర్పల్లి పోలీసులకు అప్పగించారని, ధనంబండకు చెందిన యువకులు గ్యాంగ్ రేప్ కు పాల్పడినట్లు తెలిసిందని చెప్పారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దారి వెంట వస్తున్న యువతులను మాయమాటలు చెప్పి కారులో ఎక్కించుకొని దుబ్బాక ధనంబండ మధ్యలో ఉన్న నల్లగుట్ట సమీపంలోని అడవి ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం తాగించి అత్యాచారం చేయడం శోచనీయమని అన్నారు. స్త్రీలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించకపోవడమే వల్లే నిత్యం అత్యాచారాలు హత్యలు జరుగుతున్నాయన్నారు. స్త్రీలకు సంబంధించి ఎన్ని కొత్త చట్టాలు తెచ్చిన స్త్రీలపై ఘోరాలు ఆగడం లేదన్నారు. దేశంలో ప్రజా ప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలపైన 150 కేసులు మహిళపై నేరాలు సంబంధించిన కేసులు ఉండడం బాధాకరం అన్నారు. ప్రజా ప్రతినిధులు స్త్రీలపై అఘాయిత్యాలకు పాల్పడం చూస్తే స్త్రీలకు ఎలాంటి రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు వెంకటి ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మినీ జిల్లా బేస్‌బాల్ బాల బాలికల జట్టు ఎంపికలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

25న మినీ బేస్ బాల్ నిజామాబాద్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. బాలుర బాలికల ఎంపిక ఉదయం 9 గంటలకు సాంఘిక సంక్షేమ సుద్దపల్లి క్రీడా మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జిల్లా కోచ్‌లు నరేష్ మౌనిక జోష్ణలకు రిపోర్ట్ చేయాలని అన్నారు. క్రీడాకారులు జనవరి 2013 తర్వాత జన్మించి ఉండాలని ప్రధాన కార్యదర్శి వినోద్ తెలిపారు.

ఇసుక దందా ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధం

- కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

కాంగ్రెస్ పార్టీపై, నాయకులపై ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన ఇసుక దందా ఆరోపణలపై తెలంగాణ తల్లి సాక్షిగా తాము కూడా సిద్ధమే అని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి , బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్ మాట్లాడుతూ... గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అవినీతి మీద, ఇసుక దందాపై తెలంగాణ తల్లి విగ్రహం సాక్షిగా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులకు దోచుకుని, దాచుకోవడం అలవాటు


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అయిపోయిందని, అధికారం పోయి 14 నెలలు అవుతున్నా...తిన్నది మర్చిపోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పెద్ద వాగు ఇసుకను ట్రాక్టర్ ట్రిప్పుకు 5 వేల నుండి 6 వేల రూపాయలకు అమ్మింది మీరు కాదా అని అడుగుతున్నామని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దంపులు చేసుకుని నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు ఒక టిప్పర్ ఇసుకను 40 వేల నుండి, 50 వేలకు అమ్మింది నిజం కాదా అని అడుగుతున్నామని అన్నారు. ప్రస్తుతం వే బిల్లుల ప్రకారమే ఇసుక నడుస్తుందని, ప్రజలకు అంతా తెలుసని, ప్రజా అవసరాల కోసం తక్కువ ధరకే ఇసుక అందే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం , సీఎం రేవంత్ రెడ్డి కృషిచేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం జీవన్, ముస్కు మోహన్ రెడ్డి, రేండ్ల రాజారెడ్డి, బద్దం లింగారెడ్డి, బాలె శ్రీనివాస్ , ఓర్సు రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలంపాట



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోగల ఎక్సైజ్, ప్రొహిబిషనరీ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ సోమవారం తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు 25శాతం డబ్బులు జమ చేసి ఈ వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

- నిజామాబాద్ జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- పీడీఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ఆర్మూర్

నిజామాబాద్ జిల్లాకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ప్రశ్నించే పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్,డాక్టర్ కర్క గణేష్, జిల్లా కోశాధికారి నిఖిల్, సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఆర్మూర్ ఏరియా సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్‌ను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పివైఎల్ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో నిజామాబాద్ జిల్లాకు విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిజామాబాద్ జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలను మంజూరు చేసి నిజామాబాద్‌ను విద్యాహబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పిసిసి అధ్యక్షులు, పార్టీ సలహాదారులు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ జిల్లా విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చడంలో మాత్రం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. స్వయాన ముఖ్యమంత్రి విద్యాశాఖ సంబంధించిన అధికారాలు చూస్తున్నా గానీ ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్, మెస్ బకాయలు చెల్లించకపోవడం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటున్నారు. నిరుద్యోగ యువకుల సమస్యలు పరిష్కరించకుండా, ఉద్యోగా లు భర్తీ చేయకుండా ఇటువంటి అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎన్నికల ప్రచారం రీత్యా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ను పోలీసులు ఉదయం ఇంటి వద్ద అరెస్ట్ చేసి 4వ టౌన్ కు తరలించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, అధికారంలోకి వస్తె ఏడవ గ్యారంటీగా స్వేచ్ఛ ప్రజాస్వామిక హక్కులను కాపాడతానని హామీ ఇచ్చి ప్రశ్నించే గొంతులను అరెస్ట్ చేయటం దుర్మార్గం అని అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ నిధులు మూడేళ్లుగా 8వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. విద్యారంగాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీ కి పట్టభద్రుల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

ఆర్మూర్: సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా పిడిఎస్యు నాయకుల అక్రమ అరెస్టులను ఖండించాలని ఏరియా ఉపాధ్యక్షుడు వినోద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు వినోద్, కార్యదర్శి సిద్దు మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ముందస్తు పేరుతో సిపిఐ ఎంఎల్ మార్క్స్ లైన్ సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్ , పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు నరేందర్ , ఏరియా అధ్యక్షులు నిఖిల్ ల ను అక్రమంగా పోలీసులు అరెస్టు చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలోకి వచ్చి సంవత్సరం గడిచినా విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలకు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు నవదీప్. సాయి. నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకుని లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత కింద జిల్లాలో చేపట్టే కార్యక్రమాల గురించి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలాన్నారు. ప్రధానంగా పొదుపుపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన ర్యాలీలు, వినియోగదారులతో ఆర్థిక అక్షరాస్యత సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ సాయాగౌడ్, నాబార్డు డీడీఎం ప్రవీణ్, మెప్మా పీ.డీ రాజేందర్, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గుడిసె దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ

నవతెలంగాణ-రామారెడ్డి

షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గుడిసె దగ్ధమైన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడుగుమర్రి తాండాకు చెందిన కెలుత్ ధర్య నివాసపు గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. 10 తులాల వెండి, రూ.40,000, నిత్యావసర సరుకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబంతోపాటు, గ్రామస్తులు కోరుతున్నారు. ఘటనా స్థలాన్ని ఆర్ఐ రవి కిరణ్ పరిశీలించి, ఆస్తినష్టాన్ని అంచనా వేశారు. దాదాపు రూ.1,20,000 ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

బాధితురాలికి అండగా


ఆర్థికసాయం అందజేస్తున్న జీవదాస్ హాస్పిటల్ సిబ్బంది

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు పుల్ల మానెమ్మ పూరి గుడిసె కాలిపోయింది. నగదు ఆరు లక్షల రూపాయలతో పాటు తులం బంగారం, 20 తులాల వెండి కాలిపోయింది. ఇల్లు కాలిపోయిన బాధితురాలికి ఎల్లారెడ్డి జీవదాస్ హాస్పిటల్ డాక్టర్స్ స్టాఫ్ బాధితురాలికి సోమవారం ఆర్థికసాయం అందజేశారు. వంట సామగ్రి అన్ని రకాల సామగ్రిని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు లక్ష్మణ్ ఠాగూర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నె వెంకట్, బలరాం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ముమ్మర ప్రచారం

- కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి
- పట్టభద్రుల వద్దకు కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, జిల్లాలో కాంగ్రెస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. పలు మండలాల్లోని గ్రామాల్లో ప్రచారం చేశారు.

తాడ్వాయి : ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కాంగ్రెస్ మండల నాయకులు ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. అధికారం చేపట్టిన తక్కువ సమయంలోనే గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించి జాబ్ క్యాలెండర్ ప్రకటించి 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందంటూ ఓటర్లకు ప్రచారం చేశారు. సోమారం, తాడ్వాయి, చిట్యాల, ఎండ్రియాల్, దేవాయిపల్లి, కృష్ణాజీవాడీ గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, సమన్వయకర్త మహమ్మద్ షౌకత్ అలీ, సంతాజిగారి సుధాకర్ రావు, దుడే సంతోష్, గ్రామ అధ్యక్షులు మెట్టు రామచంద్రం, కాట్రోత్ రామచందర్ మమత, గైని జ్యోతి, శ్రీకాంత్, గైని రాజలింగం, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


దోమకొండ : ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భిక్కనూర్ : కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డాక్టర్ ఆల్ ఫోర్స్ నరేందర్‌రెడ్డికి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భిక్కనూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన వారి వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ అవకాశాలు, న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ గౌడ్, శేఖర్, బాబు, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : ఈనెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని, భారీ మెజార్టీతో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత, ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు చంద్రయ్యగారి అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని అంబారిపేట్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. ప్రస్తుత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుంటే మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో అన్నివర్గాల ప్రజల అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ తాటిపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ గౌడ్, యూత్ అధ్యక్షులు వినీత్, పట్టభద్రులు, తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రచారాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గులాం హుస్సేన్, నాయకులు పర్వతరావు, సాయగౌడ్, ఫరూక్ సాబ్, శివకుమార్, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ధ్యానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని (అటానమస్) మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ ఉష రాజయోగలచే కలశాల విద్యార్థినీలకు ధ్యానం మానసిక ఒత్తిడి అధిగమించడంపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జీవితంపై సానుకూల దృక్పథం పెంపొందించుకోవడం, ఆశావాదంతో అనుకున్నవి సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత కోఆర్డినేటర్ వై.రేవతి, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం


పుష్పగుచ్ఛం అందజేత

నవతెలంగాణ-బోధన్

జీవన గమనంలో ప్రతి వ్యక్తి పలు సమస్యలతో ఒత్తిడికి గురవుతారని, ఒత్తిడికి భయపడి బెదరవద్దని, ప్రముఖ శిక్షకులు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పదవ తరగతి విద్యార్థులకు టెన్ టెన్ అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఒత్తిడిని ఎలా జయించాలనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని విద్యార్థులకు పరీక్షలలో ఎలా విజయం సాధించాలనే అంశంపై వివరించారు. పరీక్షల ఒత్తిడి నుంచి ఎలా విజయం సాధించాలి, నిత్యజీవితంలో ఏ విధంగా ఎదగాలి, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులతో, తోటి వారితో ఎలా మెలగాలనే విషయాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. అలాగే హైదరాబాద్ లాంటి నగరాలలో ఒత్తిడితో కూడిన కార్పొరేట్ విద్య మంచిది కాదని, బడ్జెట్ విద్యాసంస్థలలో విలువలతో కూడిన విద్యాబోధన అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు అందుబాటులో ఉండే ఫీజులతో విద్యా బోధన చేసే కళాశాలలో చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇలాంటి కార్యక్రమాన్ని ప్రయివేటు విద్యాసంస్థలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా వికాస్ కళాశాల చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్య ప్రకాష్, విజయసాయి కళాశాల చైర్మన్ సుబ్బారావు, విజయ సాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, వివేకానంద హైస్కూల్ చైర్మన్ గజానంద్, సంతోష్, ఉపాధ్యాయులతో పాటు 1500ల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల తొలగింపు

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి వెళ్లాలంటే 'ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే' అనే శీర్షికన సోమవారం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామ సమీపంలోని వాగు వద్ద దుర్వాసనతో సంచులలో ఉన్న కోళ్ల వ్యర్థాలను సోమవారం ఉదయం పంచాయతీ అధికారులు, సిబ్బంది తొలగింపజేశారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి

- సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-పిట్లం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గానూ ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల బూతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల బూత్‌లో విద్యుత్, సరిపడా సిబ్బంది, తాగునీటి సదుపాయం, టాయిలెట్స్, వికలాంగ పట్టభద్రులకు వీల్‌చైర్ లాంటి సదుపాయాలను సమకూర్చి పోలింగ్ నాటికి సిద్ధం చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ శీతల్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

తొలగించిన ఓట్లను యథావిధిగా ఉంచాలి

- తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల, ఉపాధ్యాయుల టీచర్ ఎమ్మెల్సీ ఓట్లను తప్పుడు ఫిర్యాదుతో తొలగించారని, తుది జాబితాలో ఉన్న ఓట్లను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేవలం తప్పుడు ఫిర్యాదు ఆధారంగా తొలగించడం సరికాదని తుది జాబితాలో ఉన్న వారందరినీ ఓటు వేయడానికి అనుమతించాలని, ఈ విషయమై కామారెడ్డి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని తెలంగాణ లెక్చరర్ల ఫోరం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బాలు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి పేరుతో తప్పుడు ఫిర్యాదు చేశారని, కొందరు ఎమ్మార్వోలు అవగాహన లోపంతో ప్రైవేటు అధ్యాపకులు ఉపాధ్యాయుల ఓట్లను తొలగించారని, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేసి తుది జాబితాలో ఓట్లు వచ్చిన తర్వాత ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తప్పుడు ఫిర్యాదు చేసిన వారి పైన చర్యలు తీసుకోవాలని ప్రైవేటు ఉపాధ్యా యులు అధ్యాపకులు తమకు అనుకూలంగా ఓటు వేయరని దురుద్దేశంతో ఒక ఉపాధ్యాయ సంఘం వారు ఈ పనిని చేయడం వారి అవివేకానికి నిదర్శనమ న్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నత విద్యావంతుల ఓట్లను తొలగించ డం చాలా బాధాకరమని, దీనిపైన జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిప త్రాన్ని అందజేశారు. అర్హులైన వారందరి ఓట్లను యధాతథంగా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకుల సంఘం పట్టణ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, బీమా గౌడ్, రవి, శ్రీధర్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా సిద్ధం

- డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రావు


ప్రసాదరావును సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ప్రణాళికతో చదువుతున్నారని రాష్ట్రస్థాయి ర్యాంకులు వస్తాయని మైఫ్రూట్ ప్రింట్సు రచయిత డాక్టర్ అంబీర్ రాజేంద్ర ప్రసాదరావు అన్నారు. ఆయన సోమవారం దేమీకలాన్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థిని విద్యార్థులు 10వ తరగతి పరీక్షల కోసం సమయ పాలన పాటిస్తూ ఉపాధ్యాయుల మెలకువలు పాటిస్తూ ప్రణాళిక బద్ధంగా సిద్ధమవుతున్నారని ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు వస్తాయని అన్నారు. పాఠశాలకు వచ్చిన రచయిత డాక్టర్ రాజేంద్ర ప్రసాదరావును సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, అంబీర్ మనోహర్‌రావు, భాస్కర్‌రెడ్డి, నారాయణ, సతీష్, రాధా, మారుతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలు


మాట్లాడుతున్న ఆదర్శ రైతు కరటూరి పాపారావు

నవతెలంగాణ-నిజామాబాద్

సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలని పలువురు అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కరటూరి పాపారావు వ్యవసాయ క్షేత్రాన్ని నిజామాబాద్ పట్టణంలోని నలంద పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ఎలా చేస్తారు, తక్కువ పెట్టుబడి, సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడంపై పాపారావు అవగాహన కల్పించారు. ముఖ్యంగా తక్కువ స్థలంలో 25 రకాల కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి కూరగాయల సాగుపై మెలకువలు నేర్పించారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తే శరీరానికి అవి ఎంతటి పోషకాలు ఇస్తాయో వివరించారు. చిన్నతనం నుండే విద్యార్థులు వ్యవసాయం, కూరగాయల సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సందర్భంగా నలంద పాఠశాల యాజమాన్యం ఆదర్శ రైతు పాపారావును ఘనంగా సన్మానించారు.

ఉపాధి హామీ పనులతోనే భూముల అభివృద్ధి

- ఎంపీడీవో నరేష్

నవతెలంగాణ-లింగంపేట్

ఉపాధి హామీ పనులతోనే రైతులు తమ భూములను అభివృద్ధి చేసుకోవచ్చని మండల అభివృద్ధి అధికారి నరేష్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పర్మళ్ల, పర్మళ్ల తండాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న సన్నకారు రైతులు తమ పంట పొలాల్లో ఎత్తు వంపులు ఉంటే ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టుకోవచ్చునని తెలిపారు. రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం నర్సరీని ఆయన పరిశీలించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తుగా లింగంపేట్ మండల కేంద్రంలోని రామాలయం జోగినాథ్ గుట్టపై ఉన్న శివాలయం వద్ద పారిశుధ్య పనులను ఎంపీఓ మలహరి గ్రామపంచాయతీ కార్మికుల చేత చేయించారు. ఆలయాల చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. మహాశివరాత్రికి భక్తుల సౌకర్యార్థం భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఉపాధిహామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆస్పత్రిలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్య ఇబ్బందులను గుర్తించిన జిల్లా అధికారులు సోమవారం అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్ట్ ప్రేమలత ఆసుపత్రి ప్రాంగణంలో బోరు వేయడానికి అనుకూలమైన స్థలాన్ని పరిశీలించారు. బోరు వేస్తే నీళ్ల పడతాయని బోరు పాయింట్ చూసి డిప్యూటీ డీఎంహెచ్వో ప్రభు కిరణ్‌కు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో అమ్మ ఒడి కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో వైద్య సిబ్బంది వైద్య సేవలు పరిశీలించారు. అలాగే ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పీహెచ్‌సీలలో 30 సంవత్సరాలు పైబడి వారికి ఎన్‌సిడి వైద్య పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి దివ్య, హెచ్‌ఈవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బాసటగా


ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట స్కూల్ తండాకు చెందిన అక్కా చెల్లెల్లు ఇద్దరు విద్యార్థులు క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లగా, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని తెలుసుకుని గ్రామస్తులతో పాటు దాతలు అంతా కలిసి దాదాపు రూ.1,70,000 నగదును గ్రామస్తులు హాస్పిటల్ వెళ్లి బాధితులకు అందజేశారు. ఆర్ఆర్ వైన్స్ కరుణాకర్‌రెడ్డి రూ.10,000, సలావత్ బుచ్చిరెడ్డి రూ.5500, బీటెక్ సేవ్య రూ.5100, మద్దికుంట నరసాగౌడ్ రూ.5000, గంగావత్ పెంట్యా రూ.5000, వంశీరెడ్డి రూ.5000, భూక్య నరేష్ రూ.5000 తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందజేసిన దాతలకు పిల్లల తల్లిదండ్రులు, తాండవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అందజేసిన వారిలో బుచ్చిరెడ్డి, పెంట్యా సేవ్య నాయక్, రమేష్, శంకర్, నంద తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి ఆభరణాలు అందజేత


ఆభరణాలు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయానికి సోమవారం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి శ్రీనివాస్ స్వప్న దంపతులు కిలో వెండితో తయారుచేసిన నాగ ఆభరణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామగిరి శర్మ వెండి ఆభరణానికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ జెడ్పీటీసీలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతే గ్రామ మాజీ సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి మాతృ మూర్తి ఆదివారం చనిపోవడంతో సోమవారం తాజా మాజీ జెడ్పీటీసిలు మోతే గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ జడ్పీటీసీలు నాగిరెడ్డిపేట్ మనోహర్ రెడ్డి, దోమకొండ తిరుమల్‌గౌడ్, మాచారెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ బాలరెడ్డి, డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కబ్జా భూమిపై సర్వే


సర్వే చేయిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని మానిక్ బండారు గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమిపై సర్వే సోమవారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కబ్జా భూమిపై సర్వే చేపట్టారు. సంబంధిత సర్వేయర్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. కబ్జా భూమిపై సర్వే నిర్వహించి ఉన్నత అధికారులకు సమాచారం అందిస్తామని తెలిపారు. దీనిపై ఉన్నత అధికారుల సమాచారం ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాయ్ సింగ్, మాజీ ఎంపీటీసీ నర్స గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి అనూప, ఇరిగేషన్ అధికారి దివ్య భారతి, స్థానిక నాయకులు ప్రభు, అర్జున్, నర్స గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి అనూప, ఇరిగేషన్ అధికారి దివ్య భారతి, స్థానిక నాయకులు ప్రభు, అర్జున్ పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన డీఎల్పీఓ


వంటలను పరిశీలిస్తున్న డీఎల్పీవో

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆర్మూర్ డీఎల్పీఓ, మండల ప్రత్యేకాధికారి శివకృష్ణ సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, తరగతి గదులను, ఫిర్యాదుల పెట్టెను, విద్యార్థుల భోజనానికి అందించే వంట సరుకులను, సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలిం చారు. 10 వ తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, అందరు ఉత్తీర్ణులయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఎస్.ఓ సంధ్యా రాణికి, ఉపాధ్యాయినులకు సూచించారు. ఆయనతోపాటు ఎంపీఓ శివ చరణ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్ ఉన్నారు.

కొండెల సాయిరెడ్డికి స్వాగతం


స్వాగతం పలుకుతున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
అఖిల భారత భారతీయ కిసాన్ సంఘ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికై మొట్టమొదటి సారిగా జిల్లాకు వస్తున్న కొండేల సాయి రెడ్డి ని టోల్ ప్లాజా వద్ద ఇందల్ వాయి మండలంలోని గన్నారం మాజీ సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి అద్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కెపి రెడ్డి యాదవ్, వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రెడ్ క్రాస్ తలసేమియా ఆసుపత్రిలో
ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం


ఆరోగ్య శ్రీ ద్వారా రక్తమార్పిడి మందులు అందిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్‌లో తలసేమియా వ్యాధి రక్త మార్పిడికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రక్త మార్పిడి అలాగే ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు తెలిపారు. ఆరోగ్య శ్రీ ద్వారా రక్తమార్పిడి అలాగే ఉచి తంగా మందులు సోమ వారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పేషంట్స్ అయిదు సంవత్సరాలు వయసు దాటినవారికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి అని అన్నారు. అయిదు సంవత్సరాల వయసు లోపు ఉంటే పేరెంట్స్ రేషన్ కార్డు, వారి ఆధార్ కార్డు తప్పనిసరి అని తెలిపారు. పేషెంట్స్ ఒకరోజు ముందు ఫోన్ చేసి బుకింగ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం మంగళ, గురు, శని వారాల్లో రక్త మార్పిడి ఉంటుందని, తదుపరి సంఖ్య పెరిగినప్పుడు ప్రతిరోజు ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇతర ఏదైనా వివరాలకు 08462-222002 సంప్రదించాలని తెలిపారు.

సీఎం ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడగటానికి వచ్చారో

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఏ మొఖం పెట్టుకొని నిజామాబాద్‌కు ఓట్లు అడగటానికి వచ్చారో సమాధానం చెప్పాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో హిందూ దేవుళ్లపై ప్రమాణాలు చేసి ఇచ్చిన హామీలను ఏ గంగలో కలిపారని సీఎం రేవంత్‌ను ధన్ పాల్ ప్రశ్నించారు. సిద్దుల గుట్ట మీద ఒట్టు పెట్టి ఇప్పటివరకు ఒక్క హామీ నెరవేర్చకుండా ఏ మొఖం పెట్టుకొని నిజామాబాద్‌కు ఓటు అడగటానికి వచ్చారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో రీజినల్ లైబ్రరీలో ఎమ్మెల్యే ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వం ఇస్తానన్న 2 లక్షల ఉద్యోగాల్లో నిజామాబాద్ యువతకు ఎన్ని ఇచ్చారో చెప్పాలన్నారు. రూ.4వేల భృతి ఎంత మంది నిరుద్యోగులకు ఇచ్చారని, రూ.2500 ఎంత మంది ఆడపచులకు ఇచ్చారని ప్రశ్నించారు. రూ. 6 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువులకు దూరం అయ్యే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి యణ, మండల అధ్యక్షులు ఆనంద్ రావు, బీజేపీ యకులు వినోద్, మాస్టర్ శంకర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

దుబాయిలో ఉద్యోగాలంటూ
ఘరానా మోసం



దుబాయ్‌లో ఉద్యోగాలిప్పిస్తామని, లక్షలలో వేతనాలు వస్తాయని నమ్మబలికి అమాయక నిరుద్యోగులను నిలువునా ముంచిన ఉదంతం వెలుగు చూసింది. అమలాపురం నుంచి ఆర్మూర్ నియోజకవర్గం వరకూ విస్తరించిన ఈ దుబాయ్ జాబ్ స్కామ్ ప్రధాన పాత్రధారి నియోజకవర్గంలోని నందిపేట్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన కస్పా శ్యామ్ అని బాధితులు ఆరోపిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో కలకలం సృష్టించిన ఈ ఘరానా మోసంతో నిరుద్యోగులను నిలువు దోపిడీ చేసి అమాయకులకు టోపీ పెట్టిన శ్యామ్ ఒక ప్రజా ప్రతినిధి ముఖ్య అనుచరుడు అని పలువురు ఆరోపిస్తున్నారు. ఆయన అండతోనే దుబాయ్ ఉద్యోగాల స్కామ్‌కు పాల్పడ్డాడని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.
నవతెలంగాణ-ఆర్మూర్

- జాబ్ స్కామ్ ప్రధాన సూత్రధారి నందిపేట్ మండలవాసి
- 35మందినుంచి మూడున్నర కోట్లు వసూలు

ఉద్యోగాల పేరుతో ఆశావహులకు గాలం వేసి కోట్ల రూపాయలు కొట్టేసిన శ్యామ్ మాయాజాలం చూసి నందిపేట్ మండల వాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 35మంది నిరుద్యోగులను మోసగించి వారి నుంచి మూడున్నర కోట్ల రూపాయలను వసూలు చేసిన బ్రోకర్ శ్యామ్ ఉద్యోగాలిప్పించకుండా నిలువునా ముంచాడు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లి పేద కుటుంబాలకు కన్నీళ్లు మిగిల్చిన శ్యామ్ మోసాన్ని తలచుకుని బాధిత కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. ఇదేం అన్యాయమని నిలదీసి తమ డబ్బులు తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న బాధితులను శ్యామ్ ముఠా నిర్బంధించి హింసించారని బాధితులు వాపోతున్నారు. మంచి ఉద్యోగం వస్తుందని, లక్షల్లో జీతం జేబులో పడుతుందని ఏజెంట్ శ్యామ్ చెప్పిన మాయ మాటలు నమ్మిన నిరుద్యోగులు కష్టాల్లో కూరుకుపోయారు. శ్యామ్ మాయాజాలంలో చిక్కుకున్న దాదాపు 35 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో అతడికి మూడున్నర కోట్ల రూపాయలు సమర్పించుకున్నారు. నకిలీ పాస్ పోర్ట్, విజిటింగ్ వీసాలతో వారిని దుబాయ్ చేర్చిన శ్యామ్ ముఠా దాదాపు మూడు నెలల పాటు వారిని గదికే పరిమితం చేసింది. తమ ఉద్యోగాలేమయ్యాయని నిలదీస్తే రేపుమాపు అంటూ కాలం గడిపి చివరకు వారిని వదిలేశారు. దీంతో మోసపోయామని గుర్తించిన నిరుద్యోగులు దేశం కాని దేశంలో తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. ఉద్యోగం లేదు సరికదా తినడానికి తిండి కూడా లేక అవస్థలు పడ్డారు. వీసా గడువు కూడా ముగియడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన బాధితులు ఎలాగో అలా దుబాయ్ నుంచి బయటపడ్డారు. కాగా రూ. 15లక్షలు ఇచ్చి మోసపోయిన అమలాపురం కు చెందిన ఒక బాధితుడు శ్యామ్‌ను కలిసేందుకు చెప్పులరిగేలా తిరిగాడు. చివరకు శ్యామ్‌ను కలిసి తన డబ్బులు తనకివ్వాలని కోరగా శ్యామ్ అతడి అనుచరులు బాధితుడిని నిర్బంధించి హింసించారని వాపోయారు. ఈ వ్యవహారంపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని, సూత్రధారులను, పాత్రధారులు పట్టుకోవాలని, శ్యామ్ చేతిలో మోసపోయిన వారికి న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి పశువుల కాపరి మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
చెరువులో నుండి పశువులను బయటకు తీసుకుని రావడానికి వెళ్ళిన ఓబాలుడు ప్రమాద వశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు. ఇందల్‌వాయి ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ధర్పల్లి మండల కేంద్రంలోని మీడియా తాండకు చెందిన బాదవత్ చిన్న(16) తండ్రి రాములు కలిసి గ్రామంలోని పశువులను రోజువారీగా మేతకు తీసుకొని వెళ్లేవారు. మధ్యాహ్నం సమయంలో పశువులకు నీరు తాగించడానికి లోలం శివారులో ఉన్న చెరువులోకి పశువులను తీసుకుని వెళ్లారు. ఎంతసేపటికి పశువులు బయటకు రాకపోవడంతో బదావత్ చిన్న పశువులను బయటికి తీసుకుని రావడానికి చెరువులోకి వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి పోయాడు. సోమవారం మృతదేహం పైకి రావడంతో పలువురి సహకారంతో బయటికి తీశారు. మృతుని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించినట్లు ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ వివరించారు.

కార్పొరేట్ పాలిటిక్స్‌కు స్వస్తి చెప్పండి

- ఎమ్మెల్సీ అభ్యర్థి అబ్బగోని అశోక్ గౌడ్


మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

నవతెలంగాణ-ఆర్మూర్
కార్పొరేట్ పాలిటిక్స్ కు స్వస్తి చెప్పాలని ఎమ్మెల్సీ అభ్యర్థి అబ్బ గోని అశోక్ గౌడ్ సోమవారం అన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వారి బృందం తోని ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రచారంలో భాగంగా ప్రైవేట్ టీచర్లను, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి మాట్లాడారు. బిజెపి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, బిఎస్‌పి పార్టీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ..వీరు కేవలం వారి స్వలాభం కోసమే రాజకీయాల్లోకి వచ్చారని విమర్శించారు. డబ్బులు ఖర్చు పెట్టి రాజకీయాలలోకి వచ్చేవాళ్లు వాళ్ల భవిష్యత్తును చూసుకుంటారని అన్నారు. ఓటు వేసిన వాళ్ల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుందని గ్రహించాలని తెలిపారు. ఓటు వేసే పట్టభద్రులు ఆలోచించాలని తమకు వెన్నంటే ఉండి వాళ్ల పక్షాన నిలబడే వ్యక్తికి ఓటేయాలని అన్నారు. బీసీ వాదంతో పేరు చెప్పుకొని ఎమ్మెల్సీ బరిలో ఉన్న ప్రసన్న హరికృష్ణ ఎన్నడూ కూడా బీసీల ఉద్యమంలో ఎక్కడ కూడా పాల్గొన్నట్లు లేదని, బీసీ ముసుగులో నిరుద్యోగులను మోసం చేస్తున్నాడని తెలిపారు. తనను ఎమ్మెల్సీగా గెలిపించి శాసనమండలికి నిరుద్యోగుల పక్షాన నిలబడతానని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరినిడ దశరథ్, తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బెజ్జరం అంబదాస్, తెలంగాణ బిసి గ్రాడ్యుయేట్స్ ఫోరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎల్లోల్ల సురేష్, తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం నాయకులు రాజుల కృష్ణ, బాల్‌రాజ్, డి.కృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ
ఈ నెల 27న నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ పూర్వ జిల్లాలతో కూడిన కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలలో పని చేస్తున్న వారికి సంబంధిత యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 27న (గురువారం) ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఎమ్మెల్సీ పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, ఇతర అన్నిసంస్థల యాజమాన్యాలు, నిర్వాహకులు తమ సంస్థలలో పని చేసే పట్టభద్రుల నియోజకవర్గాలలో ఓటర్లుగా నమోదైన ఉద్యోగులు, కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునేలా సౌకర్యాలను కల్పించాలని అన్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు కలిగి ఉన్న వారు నిర్ణీత సమయంలోపు ఓటు వేసేందుకు వీలుగా వారికి విధులకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతించడం, షిఫ్ట్‌ల సర్దుబాటు, తక్కువ పని గంటలు కేటాయించడం వంటి వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ సూచించారు.

జన సంద్రమైన సిద్దుల గుట్ట

- భారీగా తరలివచ్చిన భక్తులు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని సిద్దులగుట్ట సోమవారం శివనామస్మరణతో మారుమ్రోగింది. సిద్దేశ్వరుడిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. శ్రీరామాలయం నుండి కోనేరు వరకు సిద్దేశ్వరునికి పల్లకి సేవ అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామాలయం, దుర్గామాత, ఎల్లమ్మ తల్లి, అయ్యప్ప, హనుమాన్ దేవాలయాల్లోనూ భక్తులు పూజలు చేశారు. భక్తులకు పట్టణంలోని పెర్కిట్ ఆనంద్ హాస్పిటల్ వైద్యులు అరుణ్ రెడ్డి, పూజా రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల విద్యార్థులు సైతం స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్ ,పిసి గంగారెడ్డి, మురళీధర్, చరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం
ఐడీఓసీ(కలెక్టరేట్)లో ఫెసిలిటేషన్ సెంటర్

సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ పూర్వ జిల్లాలతో కూడిన కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకునేందుకు వీలుగా ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి కోసం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లోని ఎస్.ఐ.సీ హాల్ (రూమ్ నెంబర్ 21) లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో ఓటు హక్కు కలిగి ఉండి, ఎలక్షన్ డ్యూటీ కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ సదుపాయాన్ని కలిపించామన్నారు. ఈ నెల 25న (మంగళవారం) ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కు ఒక్క రోజు మాత్రమే అవకాశం కలిపించడం జరిగిందన్నారు. ఎన్నికల విధులను కేటాయిస్తూ జారీ చేసిన డ్యూటీ ఆర్డర్ కాపీతో పాటు, ఎన్నికల సంఘం నిర్దేశించిన ఏదైనా ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకుని వచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్లో పోలింగ్ బృందాన్ని నియమించడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను కల్పించడం జరిగిందన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు 235 మంది, ఇతర జిల్లాలకు చెందిన మరో 20 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ ఫారం-12 ద్వారా దరఖాస్తులు చేసుకున్నారని కలెక్టర్ వివరించారు.

18 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- మాలమహానాడు జిల్లా కమిటీ



నవతెలంగాణ-కంఠేశ్వర్
పంజాబ్, తమిళనాడు రాష్ట్రంలో అమలుచేస్తున్నట్లు మాలలకు 18 శాతం రిజర్వేషన్ తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని మాల మహానాడు నాయకులు కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లాకు రాగా సోమవారం మాల మహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఎస్సి ఉప వర్గీకరణ జస్టిస్ షమీమ్ అక్తర్ సమర్పించిన నివేదిక తప్పుల తడకగా మాలలకు అన్యాయం జరిగే విదంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎట్ల నాగరాజు, ఉద్యోగుల జేఏసి నాయకులు అలుక కిషన్, జిల్లా కార్యదర్శి నాంది వినయ్ కుమార్, స్వామిదాస్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకోవాలి

నవతెలంగాణ-ఏర్గట్ల
ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద, ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఫౌండేషన్ సభ్యురాలు వజ్జ నవనీత మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి, తమ ఆత్మవిశ్వాసాన్ని ఏ విధంగా పెంపొందించుకోవాలి, భవిష్యత్ మార్గాలు ఏమిటి, ఎలాంటి నైతిక విలువలు పాటించాలి అనే అంశాలను గురించి చక్కగా వివరించారు. విలువైన సలహాలు,సూచనలు అందించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ సభ్యురాలు నవనీతను ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగరాణి పాల్గొన్నారు.

నందిపేట్‌లో చికెన్‌మేళా

- చికెన్ ప్రియుల సందడి
- భయం లేకుండా తిన్న ప్రజలు


చికెన్‌మేళాలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-నందిపేట్
చికెన్ మేళ. చికెన్ ప్రియుల సందడి. భయం లేకుండా తిన్న ప్రజలు, పాల్గొన్న ప్రజలు, నందిపేట మండల కేంద్రంలో పౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్ అసోసియేషన్ మరియు నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కంపెనీల ఆధ్వర్యంలో నందిపేట మండల కేంద్రంలో ఫ్రీ చికెన్ మేళా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఫ్రీ చికెన్ మేలా నిర్వహించడంతో చికెన్ ప్రియుల సందడి కనిపించింది. గత నెల రోజులుగా కనిపిస్తున్న బర్డ్ ఫ్లూ భయం లేక చేయకుండా చికెన్ మేళాలో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ ఇష్టానుసారంగా చికెన్ వంటకాలు ఆరగించారు. ఈ సందర్భంగా వెన్కబ్ ట్రేడర్స్ మాట్లాడుతూ చికెన్ తినడం వల్ల బర్డ్ ఫ్లూ వ్యాధి సోకుతుందని ప్రజల్లో భయం నెలకొందని ప్రజల్లో ఉన్నటువంటి భయాన్ని తొలగించడానికి కంపెనీ యజమాన్యంతో కలిసి ఫ్రీ చికెన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని చికెన్ కోడిగుడ్లను తినడం వల్ల హ్యూమినిటీ పెరుగుతుందని వైద్యులు తెలుపుతున్నారని ఇట్టి విషయాన్ని ప్రజలకు తెలపడానికిఈ ఫ్రీ చికెన్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ మేలాలో 200 కేజీల చికెన్, మరియు 2000 వేల గుడ్లను పంపిణీ చేయడం జరిగిందని. ప్రజలు భయపడకుండా చికెన్ ను గుడ్లను తిని సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో. చికెన్ సెంటర్ అధ్యక్షుడు, అంజు చౌహాన్, శ్రీనివాస్, సాహెబ్ హుస్సేన్, గంగాధర్, ట్రేడర్స్, మండలంలోని చికెన్ సెంటర్ సెంటర్ యజమానులు పాల్గొన్నారు

ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మార్చి నెల 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే, పదవ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుండి ఏప్రిల్ 04 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. ఇంటర్ పరీక్షలకు 36222 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. అదేవిధంగా పదవ తరగతి పరీక్షలకు 22915 మంది విద్యార్థులకు గాను 141 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో ఎస్.ఈ రవీందర్ కు సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హితవు పలికారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమిస్తూ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో జెడ్పి సీఈఓ సాయాగౌడ్, డీఐఈఓ రవికుమార్, జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయభాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం


విద్యార్థే ఉపాధ్యాయురాలిగా బోధన..

నవతెలంగాణ-తాడ్వాయి

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయురాలు గోరంట్ల పద్మజ తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి కిందిస్థాయి తరగతులకు విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రసన్న లక్ష్మి, అనిత పర్యవేక్షణ చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు


ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఎం.ఎల్.సి. ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఎంఎల్‌సి పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న వారు ఓటును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా.. పల్లె దవాఖాన

అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వెళ్లాలి. కానీ అలాంటి ఆస్పత్రే మందుబాబులకు అడ్డాగా మారింది. ఆస్పత్రికి సమీపంలోనే బెల్ట్‌షాప్ ఉండటంతో ఆస్పత్రి ప్రాంగణంలోనే కొందరు మందుబాబులు గుంపులుగా కూర్చుని మద్యం సేవిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదనే నిబంధలున్నా.. 'ఎవరేంచేస్తారనే' ధీమాతో మందుబాబులు ఇష్టానుసారంగా మద్యం సేవిస్తున్నారు. బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. పల్లె దవాఖాన ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారడంతో ఆస్పత్రిలో విధులు నిర్వహించే సిబ్బంది ఆస్పత్రికి రావాలంటేనే జంకుతున్నారు. పోలీసులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కనే బెల్ట్ షాప్..

- ఆవరణలోనే మద్యం సేవిస్తున్న మందుబాబులు
- ఆస్పత్రికి వెళ్లాలంటే జంకుతున్న వైద్య సిబ్బంది, రోగులు
- బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ..?


జంగంపల్లిలో పల్లె దవాఖాన..


ఆవరణలో మద్యం సేవిస్తున్న మందు ప్రియులు

నవతెలంగాణ-భిక్కనూర్

రాజంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పల్లె దావఖానను మండలంలోని జంగంపల్లి గ్రామంలో 44వ జాతీయ రహదారి పక్కన గ్రామ సమీపంలో సంవత్సరం క్రితం ఏర్పాటు చేశారు. సమీపంలోనే బెల్ట్ షాప్ ఉండటంతో మందు బాబులు మద్యం తీసుకుని దవాఖాన వరండాలో తెల్లవారుజాము నుంచే మద్యం సేవిస్తున్నారు. అలాగే మద్యం బాటిళ్లను ప్రాంగణంలో పడేస్తున్నారు. ఉదయం ఆసుపత్రికి వైద్య సిబ్బంది వచ్చి చూసేసరికి మద్యం బాటిళ్లు, తినుబండారాలు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి.

దవాఖాన సమీపంలో మద్యం సేవిస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళా వైద్య సిబ్బంది సైతం ఆస్పత్రిలో విధులు నిర్వహించాలంటే జంకుతున్నారు. కొన్ని సందర్భాలలో మద్యం సేవించిన మందుబాబులు ఆసుపత్రికి వచ్చి మద్యం మత్తులో వైద్య సిబ్బందిని విసిగించడం, దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు, మహిళలు, గర్భిణులు, చిన్నారులు సైతం ప్రాంగణంలో సేవిస్తున్న మందుబాబులకు భయపడి ఆసుపత్రికి వెళ్లాలంటేనే వణుకుతున్నారు. రోజురోజుకు గ్రామంలో ఉన్న మందుబాబులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల వారు సైతం బెల్ట్ షాపుల్లో మద్యం తీసుకుని ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం సేవించడం పరిపాటిగా మారింది.

మందుబాబుల వలన ఎదురవుతున్న ఇబ్బందులు గుర్తించి ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బెల్ట్ షాపులను తొలగించి మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఆస్పత్రులు మందుబాబులకు అడ్డాలుగా మారకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, మహిళలు, గర్భిణీ స్త్రీలు, వైద్య సిబ్బంది కోరుతున్నారు. అలాగే పోలీసులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2007-08 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్క చోట కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాము చదువుకున్న సమయంలో ఉపాధ్యాయులు బోధించిన తీరును వారు ఇచ్చిన సందేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ తమ జీవితాన్ని నిలబెట్టుకునే విధంగా చేసిన విధానాన్ని ఒకరికొకరు పంచుకున్నారు. నాటి విద్యార్థులంతా నేడు వివిధ ప్రాంతాల్లో స్థిరపడి జీవనం సాగిస్తూ మళ్లీ పాఠశాలకు రావడంతో ఆనాటి జ్ఞాపకాలు గుర్తొచ్చాయని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

పౌష్టికాహారంపై శిక్షణ

నవతెలంగాణ-రామారెడ్డి

ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారంతో పాటు, వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని ఏపిఎం ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐకెపి సిబ్బంది ఏవోలకు, సిబ్బందికి ఆరోగ్య పోషణ, మానవాభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, ఐకెపి సీసీలు, సిబ్బంది, వీవోలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఒత్తిడికి గురిచేయొద్దు

- ఎంఈఓ నాగయ్య


మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులు ఇంటి వద్ద ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా వారు ప్రశాంతంగా చదువుకునేలా విద్యార్థులు తల్లిదండ్రులు సహకరించాలని బోధన్ ఎంఈఓ నాగయ్య అన్నారు. సోమవారం మండలంలోని కల్దుర్కి జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యే విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటించాలని, ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులకు కఠినమైన ప్రశ్నలకు సమాధానాలు ఏ విధంగా రాయాలో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవి, నగేష్, విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మెరిసిన పిట్లం విద్యార్థినీలు

- 5 బంగారు, 10 సిల్వర్ మెడల్స్ కైవసం


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినీలు కరాటే అండ్ ఫైరింగ్ పోటీలలో గెలుపొంది 5 బంగారు, 10 సిల్వర్ మెడల్స్ సాధించారు. ఆదివారం సంగారెడ్డి బ్రదర్స్ ఫంక్షన్ హాల్‌లో వారియర్స్ మార్షియల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెకండ్ ఓపెన్స్ నేషనల్ కుంగ్‌ఫు కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల పిట్లం నుంచి గొల్ల మహాలక్ష్మి పి.నిక్షిత, ఓ.నిక్షిత, స్ఫూర్తి, అశ్విని పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించగా.. రాధాకుమారి, నవ్య నిఖిత, వరలక్ష్మి, నందిని కౌర్, అనురాధ, నందిని, సాయి వాగ్దేవికా, కారుణ్య శ్రీ, శ్రీ హర్ష సిల్వర్ మెడల్స్ సాధించారు. కరాటే అండ్ ఫైరింగ్ పోటీలలో బాలికలు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఏకంగా 5 గోల్డ్ మెడల్స్, 10 సిల్వర్ మెడల్స్ సాధించి మండల, పాఠశాల కీర్తిని గడించినందుకు పాఠశాల బృందం వారిని అభినందించింది. ఈ కార్యక్రమంలో కుంగ్‌ఫు మాస్టర్ శివ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు (ఎంఈఓ) దేవిసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ దొంగతనం..?

- భయంతో విద్యార్థి అదృశ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

స్కూల్‌లో ల్యాప్‌టాప్ దొంగతనం చేసిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని అచ్చంపేట్ టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్/జెసి స్కూల్లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్ మండలం పెద్ద శక్కర్గ గ్రామానికి చెందిన విద్యార్థి నిజాంసాగర్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్/జెసి స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. అయితే 17వ తేదీన పాఠశాలలోని కంప్యూటర్ క్లాస్ రూమ్ నుంచి ల్యాప్‌టాప్ తీసుకొని 18న మరో విద్యార్థితో కలిసి ఒక షాపులో విక్రయించాడు. అయితే కంప్యూటర్ శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయుడు ల్యాప్‌టాప్ కనబడడం లేదని 19న స్కూల్ ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చాడు. ప్రిన్సిపాల్ స్కూల్లో మొత్తం వెతికి సీసీ కెమెరాలలో పరిశీలించగా.. పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తీసినట్టు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యింది. ప్రిన్సిపాల్ సదరు విద్యార్థిని పిలిచి ల్యాప్‌టాప్ ఎందుకు తీశావు అని అడగగా.. 'అవును సార్.. ల్యాప్‌టాప్ నేనే తీశాను. సాయంత్రం వరకు తీసుకొస్తాను.' అని ఆ విద్యార్థి ప్రిన్సిపాల్‌తో చెప్పాడు. అయినా విద్యార్థి ల్యాప్‌టాప్ తీసుకురాకపోవడంతో మళ్లీ ప్రిన్సిపాల్ విద్యార్థికి అడగగా ఆదివారం సాయంత్రం వరకు తీసుకొస్తానని చెప్పి వెళ్లి విద్యార్థి తిరిగి రాలేదు. ప్రిన్సిపాల్ విద్యార్థి కోసం చూసినా ఎంతకీ రాకపోయేసరికి విద్యార్థి తల్లిదండ్రులకు అడగగా అక్కడికి కూడా రాలేదని వారు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఒక షాపులో విక్రయించిన ల్యాప్‌టాప్‌ను పోలీసులు మరో విద్యార్థితో వెళ్లి ఆ ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని పాఠశాలలో ప్రిన్సిపాల్‌కు అందజేశారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే పేదరిక నిర్మూలన

- ఐకేపీ ఏపిఎం రాజు


శిక్షణలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పేదరిక నిర్మూలన తగ్గుతుందని ఐకేపీ ఏపిఎం రాజు అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఆహారం, పోషణ, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై వీవోఏలు, గ్రామ సంఘం ఓబీలు, ఆరోగ్య కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రాజు మాట్లాడుతూ.. మహిళా సంఘాల కుటుంబాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే, పేదరికం నుంచి బయటపడటం సాధ్యమని అన్నారు. ప్రస్తుత రోజులలో అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో లక్షలలో రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ఈ సమస్యను పరిష్కారం కోసం మహిళలు వారి కుటుంబ సభ్యులు సంపూర్ణం పౌష్టికాహారం తీసుకోవడంతో రోగాలు తగ్గుతాయన్నారు. సంపూర్ణ పౌష్టికాహారం గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, మహిళలకు అవసరమని తెలిపారు. ఈ శిక్షణలో 1000 రోజుల ప్రణాళిక, పౌష్టికాహారం, రక్తహీనత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం మహిళలు, ఓబి సభ్యులు, ఆరోగ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు పనికి వచ్చేనా ?


పాత ఇందిరమ్మ మోడల్‌హౌస్ ముందే మరో మోడల్ హౌస్ నిర్మాణం

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం అర్హులైన ప్రతివారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని హామీనిచ్చింది. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో లబ్దిదారుల ఎంపికకు సర్వే కూడా పూర్తి చేసింది. త్వరలో వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని సంబంధిత శాఖ మంత్రి ప్రకటించారు. ఈ క్రమంలో బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గతంలో ఆదేశించారు. దాంతో అధికారులు ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి చర్యలు చేపట్టి పనులు ప్రారంభించారు. కానీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు. ప్రస్తుతం దానికి సమీపంలోనే ఎదురుగా మరో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం చేపడుతున్నారు. కాని ఇది కూడా రాబోయే రోజుల్లో నిరుపయోగంగానే వదిలేస్తారా లేదా వినియోగంలో తీసుకొస్తారా అంటూ పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న మోడల్ హౌస్‌ను అధికారులు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిధులు వృథాగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో నిర్మించిన మోడల్ హౌస్ దానికి నిదర్శనమని, దానికి బదులు ఓ నిరుపేద కుటుంబం నివసించడానికి మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తే కనీసం వారికైనా నీడనిచ్చేలా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అనాథలకు అండగా ఆలయం

- సామాజిక సేవలో బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం
- నిత్యాన్నదానంతో ఆకలి తీరుస్తున్న ఆలయ కమిటీ
- యాచకులు లేని గుడి
- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు


శ్రీ బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం



నవతెలంగాణ-రామారెడ్డి

పచ్చని అడవి.. చుట్టూగుట్టలు, సెలయేటి నీటి మధ్య కొలువుదీరింది శ్రీ స్వయంభుబుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానం. కుల మతాలకు అతీతంగా ఆలయాన్ని అంచలంచెలుగా దాతల సహకారంతో పాటు, గ్రామస్తుల పట్టుదలతో దినదినాభివృద్ధి చెందుతుంది.

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామానికి 2.5 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో, ప్రకృతి ఒడిలో శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి కొలువుదీరి ఉంది. గత 25 సంవత్సరాల క్రితం ఆలయానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు దర్శించుకునేవారు. 2000 సంవత్సరం నుంచి గ్రామస్తులంతా కుల మతాలకు అతీతంగా కమిటీగా ఏర్పడి ఆలయాభివృద్ధికి నడుం బిగించారు. ఆలయానికి మాజీమంత్రి షబ్బీర్ అలీ సహకారంతో గ్రామం నుంచి ఆలయం వరకు బిటి రోడ్డు నిర్మాణం, విద్యుత్ సరఫరా, అన్నదాన సత్ర భవన నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. ఆలయంలో అనునిత్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతిరోజు 400 మందికిపైగా ఆకలి తీరుస్తున్నారు. వృద్ధులకు, అనాథలకు సకల సౌకర్యాలతో ఆశ్రమాన్ని నిర్మించి, అన్నీ తామై సంఘ సేవలో తమ వంతు బాధ్యతను నిర్వహిస్తున్నారు. గతంలో పేదవారికి ఆలయ ఆవరణలో వివాహాలను నిర్వహించి అండగా నిలిచారు. నేడు తెలంగాణ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు దర్శించుకుంటున్నారు. ఆలయ దాతల సహకారంతో గదుల సౌకర్యం, వీఐపీలకు కాంప్లెక్స్ భవన గదులు సౌకర్యవంతంగా ఉన్నాయి. గోశాల ఏర్పాటుచేసి గోవుల నుంచి పాలతో అన్నదాన కార్యక్రమంలో స్వచ్ఛమైన పెరుగును అందిస్తున్నారు. సంవత్సరం పొడవునా జలబుగ్గలు నీరు పారుతూనే ఉండటం సందర్శకులకు ఆహ్లాదకరంగా, అక్కడి సందర్శకులకు నీటి అవసరాలను తీరుస్తుంది.

శివరాత్రిని పురస్కరించుకొని ఆలయం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తుంది. భక్తుల కోసం ఏర్పాట్లను చేస్తుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలకు రవాణా సౌకర్యం కోసం కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ సంస్థ నడిపిస్తుంది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 25 తేదీన ఉదయం గణపతి పూజతో పాటు, అఖండ దీపారాధనతో ప్రారంభమై, సాయంత్రం గ్రామ ప్రధాన వీధుల గుండా స్వామి వారి పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బుధవారం 26వ తేదీ శివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 27 గురువారం ఉదయం అగ్నిగుండంలతో ఉత్సవాలు ముగుస్తాయి.

లోకల్ వాహనాలను ఉచితంగానే పంపించాలి



నవతెలంగాణ-భిక్కనూర్

లోకల్ కారు వాహనాలకు గతంలో ఎలాంటి డబ్బులు వసూలు చేయకుండా టోల్‌ప్లాజా యాజమాన్యం ఉచితంగానే పంపించారని.. ప్రస్తుతమున్న కాంట్రాక్టర్ కూడా లోకల్ వాహనాలకు ఎలాంటి టోల్ వసూలు చేయకుండా ఉచితంగానే పంపించాలని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, రామేశ్వర్ పల్లి అఖిలపక్ష నాయకులు సోమవారం టోల్ ప్లాజా మేనేజర్ ప్రకాష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టోల్‌ప్లాజా సిబ్బంది లోకల్ వాహనదారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, నిత్యం లోకల్ వాహనాలు వ్యవసాయ బావుల వద్దకు, కామారెడ్డికి పనుల నిమిత్తం వెళ్తుంటారని రోజు 4 లేదా 5 సార్లు వాహనాల రాకపోకలు సాగిస్తారని దీనిని దృష్టిలో ఉంచుకొని లోకల్ వాహనాలను ఉచితంగానే పంపించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్‌పల్లి అఖిలపక్ష నాయకులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE Ist ADDL JFCM AT: NIZAMABAD
O.S.NO. 174 OF 2020

Between:-
Smt. Gooda Venkata Laxmi
..Petitioner/Plaintiff
AND
Sri.M.kishan Goud and Another
...Respondents/Defendants

To,
Sri.M.Kishan Goud S/o Not known, Aged about 60 Yrs Occ:President Ganesh Housing Society Drivers Colony R/o H.No.10-14-1834/5, Seetharam Nagar colony, Phase-I, Nizamabad Ph.9246791132.

It is informed you that the Petitioner/plaintiff filed the above case before the Hon'ble Ist ADDL JFCM at Nizamabad vide O.S No.174/2020 and the same is posted to 27.02.2025 for appearance of you at 10.30 A.M before The Hon'ble Ist ADDL JFCM at Nizamabad. You are Instructed appear either in person or through your duly instructed Advocate. If you do not appear the matter will be set exparte and decided on merits.

// BY ORDER OF THE COURT //
Sd/-
D. NAGESHWAR
K. SURYA KIRAN
DAYANA MOYA GEETHIKA
Advocates, Nizamabad.
Cell No.94414 79304.